అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

విశాలాంధ్ర-జియ్యమ్మ వలస: ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్దే ముందున్న ధ్యేయమని కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. జియ్యమ్మవలస, పార్వతీపురం రహదారికి అనుకోని ఉన్న గెద్ద తిరువాడ పంచాయతీ పరిధిలో గల చిలకలవాని వలస మీదుగా పసుపు వాని వలస వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం నిధులతో చేపట్టనున్న 1.65 కిలో మీటర్ల బిటి రోడ్డు రహదారి పనులకు 1.65 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి జరగాలంటే లింకు రోడ్డులు సదుపాయం ఉండాలని అప్పుడే మారుమూల పల్లెలు కూడా అభివృద్ధి పదాన ముందుకు వెళ్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటరీ పార్టీ అధికారి ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, లంక గోపాలం, దాసరి రామారావు, జోగి భుజింగరావు, జనసేన పార్టీ నాయకులు కూటమి నాయకులు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు గంట శ్రీనివాసరావు, మండల జెఈ పార్థసాయి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర-సీతంపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీతంపేట నందు పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ బిఐ సిబ్బందికి అవగాహన కల్పించారు. విలువైన దస్త్రాలు, ఎలక్ట్రికల్ పరికరాలు అనగా కంప్యూటర్ మొదలగునవి అగ్ని ప్రమాదానికి గురైన బ్యాంక్ లో ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ ఎక్స్ టింగ్ విషర్ ఉపయోగించి మంటలను నివారించడం వల్ల అగ్ని ప్రమాదం నుండి రక్షించబడిన మిగిలిన భాగాలు ఉపయోగపడే రీతిలో రక్షించబడతాయని చెప్పారు. అలానే డ్రై కెమికల్ పౌడర్ ఎక్స్టింగ్ విషర్ ఉపయోగించే పాస్ పద్ధతి అని డెమో చేసి తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ యలమంచిలి సత్తిబాబు, బ్యాంక్ సిబ్బంది యమ్. శ్యామలరావు, టిరాజా, సిహెచ్ నరసింహారావు, బ్యాంక్ వినియోగదారులు పాల్గొన్నారు.

ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు

సిద్ధంగాఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు సీఎం పిలుపు

విశాలాంధ్ర-పార్వతీపురం: జాతి భద్రత రీత్యా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సివిల్ డిఫెన్స్ అప్రమత్తతపై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు భయభ్రాంతులు అయ్యే అవ కాశం ఉందని, సివిల్ డిఫెన్స్ పట్ల అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. అన్నిశాఖలు ముఖ్యంగా భద్రతా దళాలు పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, పోలీస్ సూపరింటెండెంట్ ఎస్ వి మాధవరెడ్డిలు పాల్గొన్నారు.

దివ్యాంగ అభ్యర్థులకు ఉచిత మెగా డిఎస్సి క్రాష్‌కోర్స్‌పై శిక్షణ

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో గల దివ్యాంగులైన అభ్యర్థులకు ఉచిత మెగా డి ఎస్ సి క్రాష్ కోర్సును విజయవాడలో నిర్వహిస్తున్నారని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్దుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె కవిత తెలిపారు.ముఖ్యంగా దృష్టిలోపం, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ మొదలగు దివ్యాంగులైన, ఎస్ జి టి ఉపాధ్యాయ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల కోసం ఈ శిక్షణను ఏర్పాటు చేశారని ఆమె పేర్కొన్నారు. ఈ కోర్సుకు దరఖాస్తులు ఈ నెల 11వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని, అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్లైన్ లో వెబ్ సైట్ ను సందర్శించి ధరఖాస్తు చేసుకొనవచ్చని చెప్పారు. కనీసం 40శాతం వికలాంగత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని ఆమె స్పష్టం చేశారు. శిక్షణకు ఎంపికను టెట్ స్కోర్ ఆధారంగా జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడమే కాకుండా, స్టడీ మెటీరియల్, ఉచితభోజనం, వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుం దన్నారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని ఆమె కోరారు.

సమస్యలకు పరిష్కారం చూపని సమావేశాలు ఎందుకు?

మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ప్రశ్నలు

విశాలాంధ్ర-సాలూరు: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి జి.రాములమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం లో ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. ముందుగా వ్యవసాయ ప్రగతిని ఏఓ అనురాధ పండా చదివి వివరించారు. రాయితీపై వ్యవసాయ ఉత్పాదక పరికరాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వలన రైతులకు ప్రయోజనం చేకూరదని దాదాపు బహిరంగ మార్కెట్ లో ఉన్న ధరలకే ప్రభుత్వం పరికరాలను అందిస్తుందని.దీని వలన రైతుకు కలిగే ప్రయోజనం ఏముందని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ప్రశ్నించారు. స్ప్రేయర్స్ కి 1000 రాయితీ ఇస్తున్నారని గతంలో 2500 రాయితీ ఉండేదన్నారు.అదేవిధంగా రైతుకు ఉపయోగపడే టార్పాలిన్‌లను ప్రభుత్వం సరఫరా చేయడం లేదన్నారు.అన్నదాత సుఖీభవ పథకం కోసం రిజిస్ట్రేషన్ అంటూ సుదూరప్రాంతాలకు వలస వెళ్లినవారిని సైతం వెనక్కి రప్పించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు.ఈ విధానం వలన రైతుకు ప్రయాస తప్ప ప్రయోజనం చేకూరదన్నారు.విద్యాశాఖ లో పదవతరగతి ఫలితాలలో సాలూరు మండలం 95% ఉత్తీర్ణత సాధించిందని ఎంఈఓ-2 వివరించారు.మండలం నుండి 1182 హాజరుకాగా 1124 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.జిల్లాలో 1,2,3వ స్థానాలను సాలూరు విద్యార్థులు కైవసం చేసుకున్నారని వివరించారు.దిగువరూఢి,సుల్లారి,డెన్సరాయి గ్రామాలకు ఉపాధ్యాయులు గైర్హాజరు అవుతున్నారని సంపెగిపాడు సర్పంచ్ చంద్రయ్య ఆరోపించారు.విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ మండలంలో లో ఓల్టేజీ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.మండలంలో చాలా గ్రామాలలో నిరంతరం వీధిలైట్లు వెలగుతున్నాయని ప్రజాప్రతినిధులు సభదృష్టికి తీసుకువచ్చారు.రెవిన్యూ శాఖ కోసం ఎమ్మార్వో మాట్లాడుతూ నూతన రైస్ కార్డులు,రైస్ కార్డుల విభజన,రైస్ కార్డులో సభ్యుల చేర్పు,తొలగింపులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ప్రస్తుతం ఉందన్నారు.ఒంటరి మహిళలకు, పురుషులకు రైస్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.9 తేదీ లోగా అకాల వర్షాలు పడే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ఏపిఓ రామకృష్ణనాయుడు మాట్లాడుతూ 12500 మంది ఉపాధి వేతనదారులు ఉన్నారన్నారు.నూతనంగా నిర్మించిన బిటి రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం,మునగ,కొబ్బరి ప్లాంటేషన్ కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.ఉపాధి హామీ పథకంలో అవినీతి అధికంగా ఉందని పేపర్లు కొనుగోలు పేరిట ఫీల్డ్ అసిస్టెంట్‌ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. పెదపదం పంచాయతీకి చెందిన 55 మంది వలసజీవులుగా వివిధ ప్రదేశాలలో జీవిస్తున్న వారికి ఉపాధి వేతనదారులుగా హాజరు నమోదు చేసి వారి అకౌంట్లో డబ్బులు జమ చేశారని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ ఆరోపించారు.ఈ విషయం పై కమీషనర్ కు పిర్యాదు చేస్తామన్నారు.అలాగే వితంతు ఫించన్ల ఎంపికలో అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. 2023 డిసెంబరు తరువాత భర్త చనిపోయిన వారికి మాత్రమే ఫించన్ మంజూరు చేసి అంతకుముందు చనిపోయిన వారి భార్యలకు ఫించన్ మంజూరు చేయకపోవడం శోచనీయమని ఎంపిటిసి కళ్ళేపల్లి త్రినాథరావు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గొల్లపల్లి పార్వతితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

విశాలాంధ్ర-సీతంపేట: మండలం మల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రూ 48.00 లక్షల నిధులతో మల్లి రెసిడెన్షియల్ పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభ కార్యక్రమంలో పాల్గున్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ సీతంపేట మండలం జిల్లేడుపాడు గ్రామంలోరూ 10.00 లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభించారు, జిల్లేడుపాడు గ్రామంలోరూ 33,041/- రూపాయిల నిధులతో నిర్మించిన పశువుల కోసం నీటి తొట్టె ప్రారంభించారు, అనంతరం శంభాంగ్రామంలో రూ 5.50 లక్షల నిధులతో ఆధ్వర్యంలో వాటర్ సప్లై పైప్ లైన్ ప్రారంభించారు వాభ గ్రామం లో రూ 8.80 లక్షల నిధులతో ఆధ్వర్యంలో వాటర్ సప్లై పైప్ లైన్ య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బిడ్డిక. సంధ్యారాణి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ గర్భాన సత్తిబాబు గ,సీతంపేట ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, ప్రసాద్,మాలయ్య, జనసేన రాజేష్,బీజేపీరవణమ్మ, చిరంజీవులు సింహాచలం, రఘు, శ్రీకాంత్, కిషోర్, జనసేన ప్రసాద్, పాలకొండ మండల జనసేన నాయకులు ప్రసాద్,సంతోష్,శేఖర్, సాయి,శివ,ప్రశాంత్ మరియు వివిధ హెూదాలో ఉన్న కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటికై సచివాలయం ఎదుట ఆందోళన

నీళ్ల ట్యాంక్ నిర్మించి పైప్‌లైన్ వేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని డోకిశీల పంచాయతీ బుచ్చింపేట గ్రామానికి ప్రత్యేక మంచినీటి ట్యాంకు నిర్మించి, ప్రతి వీధికి అనుసంధానం చేస్తూ ప్రత్యేక పైప్లైన్ ఏర్పాటు చేయాలని, అలాగే పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి. సంగం డిమాండ్ చేశారు. గత అనేక రోజులుగా బుచ్చంపేట గ్రామంలో నీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామస్తులతో కలిసి ఆయన బుధవారం డోకిశీల సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం పంచాయతీ కేంద్రమైన డోకిశీల నుంచి త్రాగునీరు గ్రామానికి విడుదల చేస్తున్నారని దీని మూలంగా పూర్తిస్థాయిలో త్రాగునీరు గ్రామానికి సరఫరావడం లేదన్నారు. గతంలో నిర్మించిన కొళాయిలు గ్రామానికి దిష్టిబొమ్మలా మారాయే తప్ప దాహార్తిని తీర్చడం లేదని మండిపడ్డారు. అలాగే బుచ్చింపేట గ్రామానికి ప్రత్యేక ఆపరేటర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. బుచ్చింపేట విషయంలో సంబంధిత అధికారులు చిత్తశుద్ధి చూపకుండా సమస్యను పరిష్కారం చేయకపోతే జిల్లా స్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు హేమలత లక్ష్మణరావు, రాము, శ్రీను, సరోజినీ, సింహాచలం పెద్దలు ఉన్నారు.

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు

జిల్లా ఇంచార్జి కలెక్టర్ శోబిక

విశాలాంధ్ర-పార్వతీపురం: విప్లవజ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక కొని యాడారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి కలెక్టర్ పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి పోరాటపటిమ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుం దన్నారు. భరతమాతను దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేసేందుకు ఉద్యమ బాట పట్టి, బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించారని గుర్తుచేశారు. గిరిజనుల అణచివేతను వ్యతిరేకించిన అల్లూరి, విప్లవ జ్వాలను రగిలించిన మహా పోరాట యోధుడని కొనియాడారు.ఈకార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సీహెచ్.రాధాకృష్ణ మూర్తి, పర్యవేక్షకులు శ్రీరామమూర్తి, తదితరసిబ్బంది భాగస్వాములై అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తుప్పులవాడ పంచాయతీల్లోని

పలు గ్రామాల్లో జఠిలమైన తాగునీటి సమస్య

విశాలాంధ్ర-సీలేరు: జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని బంధ వీధి, కొమ్ములవాడ, గుండ్రవాయిలు, రష్యా గూడా, గ్రామాల్లో తీవ్రమైన మంచి నీటి సమస్య నెలకొంది. ఈ సమస్యపై స్పందించిన పంచాయతీ సర్పంచ్ కేలేబు కుమారి, పంచాయతీ సెక్రెటరీ శివాజీ కూటమి నాయకులు తిరుపల్లి మన్మధరావు, బైసెట్టి సుందర్రావు, మలిశెట్టి జగ్గారావు, సుక్రి రాము గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కేలేబు కుమారి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి తక్షణమే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.మరోవైపు, కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా చౌడుపల్లి, జి.నేరేడుపల్లి, చల్లని శిల్ప, వలసగడ్డ గ్రామాల్లో బోర్లు వేయడం జరిగింది. ఈ చర్యతో ఆయా గ్రామాల్లోని మంచి నీటి సమస్య కొంతవరకు తీరనుంది. త్వరలోనే దుప్పులవాడ పంచాయతీలోని సమస్యను కూడా పరిష్కరిస్తామని కూటమి నాయకులు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జిల్లాలో రహదారులు, భవన నిర్మాణాల అభివృద్ధి పనులను జాప్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పి. ఐ. యు, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, రహదారులు భవనాల శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ప్రధాన మంత్రి జన్ మన్, ఆర్టికల్ 275, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురోగతిలో ఉన్న పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులపై ఇంజనీరింగ్ విభాగాలు నివేధిస్తే ప్రభుత్వంతో మాట్లాడి బిల్లులు చెల్లింపుకు కృషి చేస్తామన్నారు. రహదారులు, భవన నిర్మాణాలకు నిధులు సమస్య లేదని ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. పనులు జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెదబయలు మండలం బూసిపుట్టు పిట్టల బొర్ర, అనంతగిరి మండలం కటికి రోడ్డు పనుల ప్రగతిపై ఆరా తీసారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుతో గిరి యువతకు ఆర్థిక పురోగతి

ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

విశాలాంధ్ర-డుంబ్రిగుడ: కుటీర పరిశ్రమల ఏర్పాటుతో గిరిజన యువతకు ఆర్థిక పురోగతి అని విజయనగరం ఆర్టిసి రివిజనల్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ పరిధిలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తుంది. దీంట్లో భాగంగా మండలంలోని అరకు సంత బయలులో ఐదు ఎకరాలలో కుటీర పరిశ్రమ నిర్మాణానికి బుధవారం విజయనగరం ఆర్టీసీ రివిజనల్ చైర్మన్ దొన్నుదొర ,అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అనేకమంది గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లోఅరకు ప్రాంతం మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అనంతరం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 కోట్ల 80 లక్షల వ్యాయంతో 5 ఎకరాలలో 36 యూనిట్లతో పరిశ్రమలను నిర్మిస్తుందని చెప్పారు. ప్రధానంగా అరకు నియోజకవర్గ ప్రాంతానికి సంబంధించిన చిరు వ్యాపారస్తులు వీటిని వినియోగించి భవిష్యత్తులో అభివృద్ధి చెందాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకు సర్పంచ్ శారద సాగర్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఈ ఎస్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ ఎంపీపీ దన్నేరావు, కూటమి ప్రభుత్వం మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంమే అనివార్యమైతే...

పాడేరులో మాక్ డ్రిల్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: పహేల్గాం దుస్సంఘటన నేపథ్యంలో ఒక వేల పాకిస్తాన్ తో యుద్ధం వస్తే, పాక్ ఆగడాలకు చెక్ పెట్టేందుకు ముందస్తు జాగ్రత్తలు భాగంగా పాడేరులో మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, ఇటీవల పెహల్గాంలో జరిగిన దుశ్చంఘటన నేపథ్యంలో భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం నెలకొనే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు యుద్ధం సంభవిస్తే ఎదుర్కొనె విధానాలు, యుద్ధ సమయంలో చేయాల్సిన, చేయకూడని విధులు, రక్షణ భాద్యతలు గుర్చి దేశ వ్యాప్తంగా బుధవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారని అందులో భాగంగానే ఈ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని వివరించారు. అనధికార, ఫేక్ వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వార్తలు ప్రచారం చేసి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయవద్దని కలెక్టర్ కోరారు. అధికార వార్తలను మాత్రమె నమ్మాలని సూచించారు. సందర్భాన్ని బట్టి విధ్యుత్ ఆఫ్ అండ్ ఆన్ చేసే విధంగా విధ్యుత్ శాఖ సిద్ధం కావాలన్నారు. సురక్షిత ప్రాంతాలను గుర్తించాలని, విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్దంకావాలని సూచించారు. సివిల్ మరియు యూనిఫాం సేవల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉంటె ప్రమాద తీవ్రత తగ్గుతుందన్నారు. యుద్ధం వస్తే పక్కా కట్టడాలు, ట్రెంచ్ లు, కొండలు తదితర రక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. అదేవిధంగా రాత్రి సమయంలో అయితే తీవ్రవాదులు చొరబడితే ఇళ్ళల్లో లైట్లు ఆఫ్ చేయాలని, ప్రశాంత వాతావరణం ఏర్పడ్డాక లైట్లువెలిగించాలని, తద్వారా శత్రువు ఉనికిని గుర్తించవచ్చని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఎస్పి అమిత్ బర్ధర్ మాట్లాడుతూ అంతర్గతంగా, బహిర్గతంగా ఇలాంటి సమస్యలు ఎదురైతే ప్రజల సహనం, సహకారం అవసరమని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా లో రేటింగ్ కోసం కాకుండా నిజమైన న్యూస్ మాత్రమె ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని ఇవ్వాలని, ప్రజలు సేల్ఫీలు, రీల్స్ కోసం తాపత్రయ పడరాదని సూచించారు. సునిశిత అంశాలైన ఇటువంటి సంఘటనల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఫేక్ న్యూస్ ఎత్తి పరిస్తితులలో పంపరాదని ప్రజలందరూ కలసికట్టుగా సమైక్యంగా ఎదుర్కోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం జే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ట్రైనీ కలెక్టర్, కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, చింతూరు, చింతపల్లి ఎఎస్పీలు పంకజ్ కుమార్ మీనా, నవజ్యోతి మిశ్ర, సిఐ దీనబంధు, స్పెషల్ బ్రాంచ్ సిఐ అప్పల నాయుడు, ఎఆర్ ఇన్స్పెక్టర్ శేషాద్రి ఆధ్వర్యంలో వారి బృందం స్పెషల్ పోలీస్ బృందం, ఫైర్ అధికారి ఆధ్వర్యంలో వారి బృందం, జిల్లా అధికారులు వైద్య ఆరోగ్య సిబ్బంది, మెడికల్ కళాశాల విద్యార్థులు, 108, అంబులెన్స్ సర్వీస్ ల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా రాస్తే విలేకర్లపై బెదిరింపులు ...

విశాలాంధ్ర-పాడేరు: వాస్తవాలను వెలికితీసి నిజాన్ని నిర్భయంగా స్వేచ్ఛగా బాహ్య ప్రపంచానికి చాటిచెప్పే వార్తలు వ్రాసే జర్నలిస్టులకు అధికార్ల నుండి కావచ్చు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి నిండి కావచ్చు బెదిరిం పులు, దాడులు షరామామూలు అయిపోయింది. ఇటువంటి సంఘటనే పాడేరు గిరిజన సహకార సంస్థ అధికార్ల నుండి జర్నలిస్టులకు బెదిరింపులు నెలకొంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ పనిదినం మంగళవారం పాడేరు గిరిజన సహకార సంస్థ మేనేజర్ బుక్క వెంకటేష్ కి పదోన్నతి పొందిన సందర్భంగా బ్రాంచి పరిధిలో కాంట్రాక్ట్ సెల్స్‌మెన్స్, రెగ్యులర్ సెల్స్ మెన్స్, సిబ్బంది విధులకు దుమ్మా కొట్టి మోదకొండమ్మ పాదాలు వద్ద విందులు, చిందులు వేశారు. ఈ విషయాన్ని గిరిజన సహకార సంస్థ ఉద్యోగులంతా మంగళవారం విధులకు దుమ్మా? అనే శీర్షికతో విశాలాంధ్ర ప్రచురించింది. పశ్చాత్తాపం పడి తప్పుదిద్దుకునే ప్రయత్నం చేయాల్సిన అధికారులు దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో విలేకర్లపై దుర్భాసలాడుతూ, ఆపై పోలీస్ కేసు పెడతానని బెదిరింపులకు తెర తీశారు. దీనిపై పలువురు ప్రజాసంఘాల నేతలు స్పందించారు. సన్మానాలు, అభినందన సభలు మరేమైనా కావచ్చు ప్రభుత్వ పనిదినాల్లో సాయంత్రం మాత్రమే కార్యాలయాలకు సమీపంలో గాని, సమీప అతిథి గృహంలో జరుపుకోవాలి అంతేగానీ ప్రభుత్వ పని దినలో దుమ్మా కొట్టి ఎక్కడో పట్టణానికి దూరంగా విధులు నిర్వహిస్తున్న సమయాన్ని వృథా చేసి వెళ్లి తప్పుచేయడమే కాకుండా దాన్ని కప్పి పుచ్చుకొనే ప్రయత్నంలో ఇలా బెదిరింపులకు దిగడం సమంజసం కాదని, ఏదైనా ఉంటే న్యాయపోరాటం చేసుకోవచ్చని పలువురు ప్రజా సంఘాల నేతలు హితవు పలుకుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

విశాలాంధ్ర -వోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు అటవీ డివిజన్, లక్కవరం రేంజీ వరిధిలోని తులసిపాక గ్రామ శివారు ప్రాంతంలోని సోకిలేరు బ్రిడ్జ్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 347 తాబేళ్లను బుధవారం ఉదయం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. లక్కవరం రేంజ్ అటవీ క్షేత్రాధికారి గవిరెడ్డి వెంకట నానాజీ తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి ఆటోలో తరలిస్తున్న పన్నెండు బస్తాల్లోని 347 తాబేళ్లను అధికారులు పట్టుకున్నారు.ఆటో మరియు తాబేళ్లను స్వాధీనం చేసుకుని, అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామంలో రంగోలి పోడి విక్రేత నెల్లూరి శ్రీనుని అరెస్టు చేశామన్నారు.స్వాధీనం చేసుకున్న 347 తాబేళ్లలో 65 తాబేళ్లు చనిపోయాయి వాటిని చెక్పోస్టు సమీపంలో అటవీ ప్రాంతంలో దహనం చేశామన్నారు.బ్రతికున్న 282 తాబేళ్లను చింతూరు శబరి నదిలో విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు.ఈ దాడిలో ఎఫ్ ఎస్ ఓ విజయ్ కుమార్, ఎఫ్ బీ వో లు సరిత, కుమారి, హెల్పర్లు పాల్గొన్నారు.

10న కొత్తపల్లిలో సిపిఐ సమితి సమావేశం



విశాలాంధ్ర-కొయ్యూరు: ఈ నెల 10న కొయ్యూరు మండల సమితి సమావేశం అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో జరుగుతుందని సీపీఐ కొయ్యూరు మండల కార్యదర్శి ఇరవాడ దేముదు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో దేవుదు మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ కార్యక్రమాల గురించి ఈ సమావేశం లో చర్చిస్తామని తెలిపారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అల్లూరి సీతారామరాజు జిల్లా సీపీఐ కార్యదర్శి పోట్టిక సత్య నారాయణ హాజరవుతున్నారని తెలిపారు కావున మండలంలో ఉన్న సిపిఐ పార్టీ నాయకులు సానుభూతిపరులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు మహిళా సంఘాలు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

అల్లూరి జయంతి, వర్ధంతులు ఆర్భాటాలకేనా..?

సేవా కార్యక్రమాలకు చోటేది?



విశాలాంధ్ర -కొయ్యూరు: బ్రిటిష్ వారిని గడగడ లాడించి, మన్యం వీరుడుగా చరిత్రలో నిలిచిన అల్లూరి సీతారామరాజు జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడంలో ఆడంబరాలకు, ఆర్భాటాలకి పోతూ తుతు మంత్రంగా నిర్వహిం చడం సబబు కాదని ఆయన అభిమానులు అంటున్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పలుచోట్ల జరిగిన కార్యక్ర మాలను వారు తప్పుపడుతున్నారు. కేవలం విగ్రహాలకు దండాలు పెట్టి, దండ వేసి ఫోటోలకు ఫోజులు ఇవ్వడమే తప్ప చేసిందేముందని మండి పడ్డారు. పాలకులు స్థానికులు ఆర్భాటాలకు తప్ప ఇంకేముందంటున్నారు. స్థానిక మన్యం వీరుడు నడియాడిన ప్రాణాలర్పించిన విరోచితంగా పోరాడిన ప్రాంతాలలో రాజకీయాలుగా గాని ప్రాంతాలుగా గాని వారి వారి అభిప్రాయాలకు గాని ప్రాధాన్యతనిస్తూ గొప్పలకు పోతున్నారు తప్ప మన్యం వీరుడు పోరాడిన ప్రాంతాలలో మండలంలోని మంపలో గాని కొయ్యూరులో గాని పాత కృష్ణా దేవి పేటలో గాని కేడీపేటలో గాని తదితర ప్రాంతాల్లో దండలు వేసి ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప ఎక్కడైనా మన్యం వీరుడు అల్లూరి పేరిట గాని గంటం దొర పేరుతో గాని ఇంకా మిగిలిన మన్యం పోరాట వీరుల పేరిటగాని ఎక్కడైనా వస్త్రధానంగానే అన్నదానంగానే క్రీడాపోటీలు గాని రక్తదాన శిబిరాలు నిర్వహించడం లేదని పోయారు. అల్లూరిని స్మరించే కార్యక్రమాల్లో వారి వారి గొప్పలకు పోతూ పోటీపడి దండలు వేస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసం అని మన్యప్రాంత గిరిజనులు మన్యప్రాంత పోరాటయోధుల కుటుంబీకులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
డుంబ్రిగుడ. అడ్డతీగల
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్య.రెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

టికే జమ్ములో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో గల టికే జమ్ము పంచాయితిలో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహించచారు. ముందుగా స్థానిక సర్పంచ్ అడ్డాకుల భారతి ఆధ్వర్యంలో పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 7/5/1924 న అమరుడైనాడని నేటికీ వంద సంవత్సరాలు పూర్తి అయింది అలాంటి స్వతంత్ర సమరయోధుడు, గిరిజన బడుగు జీవుల కోసం ఉద్యమించిన గొప్ప వీరుడు. ఎందరో గిరిజన యువతని స్వతంత్ర సమరం వైపు నడిపిన వ్యక్తి, అలాంటి మహనీయుని వందో వర్ధంతి సందర్భంగా ఆయన పోరాటాలు, ఆయన త్యాగాన్ని స్మరించుకోవడం ఎంతో అవసరమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆయనను స్మరిస్తూ వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వ హించటం జరిగింది. వారికి ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులు ఇవ్వటం జరిగింది. విప్లవ వీరుడు గురించి గిరిజన యువతకి అవగాహన రావాలి అనేది దీని ముఖ్య ఉద్దేశ్యమని ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ చెప్పారు. అల్లూరి సీతారామరాజు మరణించినా ఆయన ఆశయాలు గిరిజన యువత ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు. ఈకార్యక్రమంలో యువత మరియు శంకరరావు, రాంప్రసాద్, కైలాస్ రావు పాల్గొన్నారు.

రైతులు తమ వివరాలు నమోదు చేయించుకోవాలి

మండల వ్యవసాయ అధికారిని నీలవేణి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి మండల రైతులు తమ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు కేంద్ర కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కావాలంటే మండల రైతులు తమ తమ సచివాల పరిధిలో గల రైతు సేవ కేంద్రంలో సంబంధిత పత్రాలు, ఆధార్, 1బి పట్టా, ఆధార్ లింక్ ఫోన్ నెంబర్, అకౌంట్ జెరాక్స్‌తో కూడిన పత్రాలను వ్యవసాయ ఉద్యానవన సహాయకులకు సమర్పించి ఈనెల 19వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం ...

విశాలాంధ్ర -దుంబ్రిగుడ: క్రీడలతోనే మానసిక ఉల్లాస మని గ్రంథాలయ శాఖ అధికారిని శెట్టి. సునీత అన్నారు. మండల కేంద్రం లోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ శాఖ అధికారిని సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు మేక పులి ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, విద్యార్థి గ్రంథాలయాన్ని ఆశ్రయించి విజ్ఞానం పెంచుకోవాలని ఆమె చెప్పారు. గెలుపు పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

9న బహిరంగ వేలం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పురపాలక సంఘమునకు సంబంధించి పురపాలక సంఘం ఆధీనములో యున్న ఐ.డి.యస్. యమ్.టి. షాపు రూములలో ప్రస్తుతము ఖాళీగా యున్న షాపు నెం.22,32,34, 35,44,46, 48 షాపు రూములను గుత్త నిబంధనల ప్రకారము గుత్తకు ఇచ్చుటకు న ఉదయం పదకొండు గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణ యందు బహిరంగ వేలం నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.ఆశక్తి గల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనగలరని కోరారు. పూర్తి వివరముల నిమిత్తము కార్యాలయము పని గంటలలో రెవెన్యూ సెక్షనులో సంప్రదించ గలరన్నారు. పైన తెలిపిన షాపులకు కేటగిరీలు వారీగా రెండేసి సాల్వెన్సీలు సంబంధిత వేలం తేదీకి 3 రోజులు ముందుగా తీసుకొని రెవెన్యూ సెక్షనులో దాఖలు పరిచి వేలంలో పాల్గొనాలన్నారు.

అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు...

- అల్లూరి 101వ వర్ధంతి కార్యక్రమంలో అల్లూరి
- చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ అనూష దేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చింతపల్లి: మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మర ణీయుడని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు 101వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ఎంపీడీవో శ్రీనివాసరావు తో కలిసి ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల దాస్య శృంకలాల నుంచి మన్యవాసులను రక్షించేందుకు మన్యం విప్లవ వీరునిగా అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం చిరస్మరణీయం అన్నారు. మన్యవాసుల కోసం ప్రాణాలర్పించిన ధీరోదాత్తుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. మన్యవాసులలోను పోరాట స్ఫూర్తిని నింపిన యోధుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. మిరపకాయ టపాతో బ్రిటిష్ పాలకుల గుండెలలో దడ పుట్టించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అన్నారు. ఆయన మరణించి వందేళ్లు దాటినప్పటికీ మన్య ప్రాంత వాసులకు ఆయన సేవలు నేటికీ చిరస్మరణీయమే అని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, జనసేన మండల నాయకులు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

విప్లవ వీరుడు అల్లూరి వర్ధంతి

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏలో స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీతంపేట ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు మరియు ఇతర అధికారులు సిబ్బంది పాల్గున్నారు.

దుంబ్రిగుడలో ఘనంగా అల్లూరి వర్ధంతి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండల కేంద్రంలోని అల్లూరి యువజన సేవా సంఘం మండల అధ్యక్షుడు కే.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో అగ్గిపిడుగు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అల్లూరి యువజన సేవా సంఘం సభ్యులు పూలదండలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం మన్యం వీరుడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ సామ్రా జ్యాన్ని గడగడలాడించి ఆయన చేసిన పోరాటాలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అల్లూరి యువజన సేవా సంఘం మండల కార్యదర్శి నవ సూర్య, అబ్బాస్, అభి, అవినాష్, అభిషేక్, సురేంద్ర, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి అర్పించిన ఎంపీపీ శెట్టి నీలవేణి

విశాలాంధ్ర -అనంతగిరి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి. అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లిఏవివి కుమార్‌లి కార్యాలయ సిబ్బంది ఎంపిటిసిలు పలువురు నాయకులతో కలిసి అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు అర్పించారు. భౌతికం గా దూరమై వందేళ్ల పూర్తి అయినా అయన దేశ పౌరుల హృదయాల్లో సజీవం గా ఉన్నారన్నారు. ప్రస్తుత దేశ పరిస్థితి ల్లో ఆపరేషన్ సిందూర్ వంటి వాటికి అల్లూరి స్ఫూర్తి అన్నారు. ప్రతీ పౌరుడిలో పోరాట పటిమ నింపిన అల్లూరి కి ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో కో అప్షన్ షేక్ మాదీనా, ఎంపీటీసీ అశోక్, నాయకులు శివ, సతీష్, అప్పలకొండ, సీనియర్ అసిస్టెంట్ రవి కుమార్, జూనియర్ అసిస్టెంట్ రాజమ్మ, కార్యదర్శులు విజయ్, సతీష్, సబ్ ఆర్డినేటర్లు కృష్ణ, కౌశిక్, సావిత్రి, తులసి తదితరులు పాల్గొన్నారు.

మన్యప్రాంత వాసులలో పోరాట స్ఫూర్తిని నింపిన విప్లవ జ్యోతి అల్లూరి

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యప్రాంత వాసులలో పోరాట స్ఫూర్తిని నింపిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. విప్లవ జ్యోతి, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, స్థానిక వీఆర్వో పండయ్య లతో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల నుంచి భారతీయులను విముక్తులను చేసేందుకు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం చిరస్మరణీయం అన్నారు. ఈ క్రమంలో మన్యవాసులను బ్రిటిష్ పాలకుల చెర నుంచి విడిపించేందుకు అల్లూరి సీతారామరాజు మిరపకాయ టపాతో విరుచుకుపడిన సందర్భాలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ గుమస్తా అంబేద్కర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట ఎంపీడీఓ గా విజయభాను మిస్రో

విశాలాంధ్ర-సీతంపేట: మండలం నూతన ఎంపీడీఓ గా విజయభాను మిశ్రో పొందూరు ఏఓ గా విధులు నిర్వహించి ప్రమోషన్‌పై సీతంపేట ఎంపీడీఓ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఇప్పటివరకు ఎంపీడీవో గా విధులు నిర్వహించిన తాడింగి. కృష్ణారావు పాలకొండ ఈవోపీఆర్డిగా బాధ్యతలు చేపట్టనున్నారని తెలిపారు. నూతన ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్చం ఇచ్చి గౌరవంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో మాసయ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9న ఎమ్మెల్యే ఇందుకూరు పేట పర్యటన

విశాలాంధ్ర-దేవీపట్నం: శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్లు ఇందుకూరుపేట వెలుగు కార్యాలయంలో ప్రతి శు క్రవారం నియోజకవర్గంలో మండలల వారీగా నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మరిశే ట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమనికి అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని మండలంలో ప్రజలందరూ తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలిపేందుకు సమస్యలు ప్రతి ఒక్కరూ రావాలని ఆయన కోరారు.

ఇంచార్జ్ ఎంపిడిఓ కు సమ్మెనోటీసు అందించిన పంచాయతీ కార్మికులు

విశాలాంధ్ర-సీతానగరం: మే 20 దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మె నేపథ్యంలో సీతానగరం మండల పారిశు ధ్య కార్మికులు ఇంచార్జి ఎంపీడీవో కేకే కుమార్ వర్మకు బుధవారం నాడు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూకార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని,ప్రతి నెల జీతాలు సకాలంలో పొందే అవకాశం పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించి ఇన్సూరెన్స్ అమలు చేయాలని కార్మికులు ఉద్యోగులకు నష్టం చేసే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర సరుకులు ధరలు అదుపు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలనే డిమాండ్స్ తో మే 20న దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులయూనియన్ జిల్లా అధ్యక్షులు జలుమూరు గౌరు, కింతలి ఆనంద్, గొడ్డు బలరాం, జలగడుగల మజ్జి గౌరీ , మూడడ్ల సీతమ్మ పాల్గొన్నారు.

జీవోలు రద్దుచేసి గిరిజనులకు అన్యాయం చేయడం కోర్టులకు తగునా?

అల్లూరి వర్ధంతి కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : ఐదవ షెడ్యూలు భూ భాగమంతా ఆదివాసి గిరిజన ప్రాంతమైనని, ఆ ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులు అంతా గిరిజనులేనని, అటువంటి ప్రాంతంలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాల్సిందేనని చట్టాలు చెబుతుంటే కోర్టులు మాత్రం వాటిని రద్దుచేసి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ దగ్గర ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్డ్ భూ భాగమంతా ఆదివాసి గిరిజన ప్రాంతమేనని ఎమ్మెల్యేల నుంచి స్థానిక వార్డు సభ్యుల వరకు అందరూ గిరిజన ప్రజా ప్రతినిధులేనని అలాంటప్పుడు ఇక్కడ ఉన్న ఉద్యోగాలు గిరిజలనులకు కాదని బయట వాళ్ళకి ఎలా ఇస్తారని నిలదీశారు. గిరిజనులు ఇంకా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలపడలేదన్న విషయం ప్రభుత్వాలు గుర్తెరగాలన్నారు. ఇప్పటికీ సామాజికంగా బలహీనంగానే ఉన్నామని. ఆర్థికంగా ఇంకా పరిపుష్టి చెందలేదని, రాజకీయం గా రిజర్వేషన్ పక్కాగా అమలవుతుండడం వలన ప్రజా ప్రతినిధులుగా ఉన్నప్పటికీ బానిసలుగా ఉండవలసిన దుస్థితి ఏర్పడుతుం దన్నారు. 1/70 భూ బదలాయింపు చట్టం గిరిజన ప్రాంతంలో ఉల్లంఘనకు గురవుతున్నా, పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గిరిజన చట్టాలు, హక్కులు, గిరిజన ప్రాంతంపై సర్వహక్కులు రాష్ట్రపతి ఆమోదంతో గవర్నర్లకు ఉందని అటువంటి గవర్నర్లు ఇచ్చిన జీవోలు రద్దు చేసే అధికారం కోర్టులకు లేదన్నారు. గిరిజనుల బాగోగులు చూసే అధికారం గిరిజన సలహా మండలి ఆమోదంతో రాష్ట్ర గవర్నర్ సిఫార్సుతో రాష్ట్రపతికి తప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ రకమైన అధికారం లేదన్నారు. 1986లో 275 జీవో ఏ ఉద్దేశంతో ఇచ్చిందో అందరికీ తెలుసునని, గిరిజన ప్రాంతంలో నిరక్షరాస్యత నుంచి అక్షరాస్యత వైపు తీసుకురావాలనే ఏకైక లక్ష్యంతో స్థానిక గిరిజనులే ఉపాధ్యాయులుగా ఉంటే స్థానికంగా ఉండి విద్య బోధనలు నేర్పవచ్చు అనే ఉద్దేశంతో ఆ రోజుల్లో ఆ జీఓ తీసుకురావడం జరిగిందన్నారు. ఆ జీవో రద్దు చేస్తూ ఐఏఎస్ అధికారుల కమిటీ దానికి ప్రత్యామ్నాయంగా జీవో నెంబర్ 3ని తీసుకురావడం జరిగిందని, ఏదో ఒక సాధారణ వ్యక్తి ఈ జీవో రద్దు చేయాలని కోర్టుకు వెళితే వెనకా ముందు ఆలోచన చేయకుండా కోర్టు కూడా జీవోను రద్దు చేయడం అర్థంలేని చర్య గా అభివర్ణించారు. ఆ క్షణాల్లో ప్రభుత్వం తరఫున లాయరు సరిగా వాదనలు వినిపించ లేదని ఆరోపణలు ఉన్నాయన్నారు. ఐదు, ఆరు షెడ్యూల్ రద్దు చేయాలని కోర్టుకు వెళ్తే వెనుక ముందు చూడకుండా కోర్టు రద్దు చేసేస్తుందా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. గిరిజన చట్టాలు, హక్కుల పట్ల కోర్టుల జోక్యం, అమలు విషయంలో తప్ప రద్దు చేసే విషయంలో సరైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలు, భూమి, అడవి, పర్యావరణం, నీరు, దోపిడికి గురవుతున్నాయని, ప్రభుత్వాలే కావాలని చేస్తున్నాయని. దీనికి వ్యతిరేకంగానే ఆ రోజు బ్రిటిష్ పాలకులను అల్లూరి సీతారామరాజు ఎదిరించి నిలబడి రక్తాన్ని చిందించి ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. అదే అడవి తల్లి అంతరించిపోతుంటే చూస్తూ ఊరుకుంటే అల్లూరికి వర్ధంతిలు, జయంతులు చేసినట్టు కాదని, ఆయన ఆశయ సాధన కోసం రక్తం చిందించైనా ఈ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆదివాసి బిడ్డల పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్. మండల కార్యదర్శి సాగిన చిరంజీవి. కిల్లో సింహాచలం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అడవిపై హక్కుని కాపాడుకోవడానికి గిరిజనులంతా ఐక్యంగా పోరాడాలి

అల్లూరి వర్ధంతి సభలో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ

విశాలాంధ్ర-కొమరాడ : అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సభను రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆ సంస్థ జిల్లా కమిటీ సభ్యులు కద్రక వెంకటస్వామి అధ్యక్షతన కొమరాడ మండలం బల్లపాడు గ్రామంలో పెద్దఎత్తున అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గిరిజన కళాకారుల గిరిజన నృత్య రూపకాలు కింద్రి, డప్పులతో సభ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ బ్రిటిష్ వాడికి వ్యతిరేకంగా రాజులు పోరాటం చేయకముందే గిరిజనులు పోరాడారని అన్నారు. అమా యకమైన గిరిజనులను వేలాది చంపి రక్తాన్ని ఏరులై పారించారని అన్నారు. గిరిజనుల తరఫున పోరాడిన అల్లూరి సీతారామరాజుని కాంగ్రెస్, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు ఆ రోజుల్లో బందిపోటుగా ముద్ర వేసి అసలైన స్వతంత్ర పోరాటాన్ని మేమే చేసామని వాటికున్న పలుకుబడితో ప్రచారం చేసుకున్నాయని ఇప్పటికీ అదే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలు పెట్టి జయంతి, వర్ధంతి సభలు జరిపి గిరిజనుల ఓట్ల కోసం నాటకాలు ఆడుతున్నారని అన్నారు. గిరిజనుల అనేక పోరాటాల ఫలితంగా ఆశ్రమ పాఠశాలలు, 1/70 చట్టం, పీసా చట్టం జిసిసి వంటి సంస్థలు ఏర్పడ్డాయి. వీటిని కూడా ఈనాడు పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయి జీవో నెంబర్ 3 రద్దు అందులో భాగమే అని అన్నారు. తరతరాలుగా అడవుల్లో జీవిస్తున్న గిరిజనులు అడవిలో ఉండాలంటే మూడు తరాల నుంచి అక్కడ ఉంటున్నట్టు హక్కు నిరూపించుకోవాలని ప్రభుత్వాలు అనడం ప్రభు త్వాల సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు నిదర్శ నమని ఇటువంటి పరిస్థితుల్లో అడవిపై హక్కుని కాపాడుకోవాలన్న ఉన్న చట్టాలను రక్షించుకోవాలన్నా గిరిజనులందరూ ఐక్యమత్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు.రైతు కూలి సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న బ్రిటిష్ వాడు చేసిన రిజర్వ్ ఫారెస్ట్ చట్టాన్ని ఇంకా మన ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయంటే దీన్ని స్వతంత్రం అందమా అని ప్రశ్నించారు. ఇది ఒక విధంగా తెల్లవాడు వదిలి వెళ్ళిన చెప్పులలో మన నల్ల పాలకులు పాదాలు దూర్చి పరిపాలన సాగిస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల కోసం, నమ్మి ఓటేసిన గిరిజన ప్రజలను గ్రామాల నుంచి ఖాళీ చేయిస్తున్నాయంటే ప్రభుత్వాలు ఎవరి పక్షాన వహిస్తున్నాయో ఆలోచించాలని అన్నారు. రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.శ్రీనునాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ముందుగా మన బల్లపాడులోనే భూ పోరాటం జరి గిందని దాదాపు 1000 ఎకరాల భూమిని సాధించు కున్నామని రోడ్లు మంచినీరు కనీస సదుపాయాలు స్కూల్స్ వంటివి ఎంతో కొంత ఈ ప్రాంతంలో సాధించు కున్నామంటే అది సంఘం ద్వారా సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమానికి రైతు కూలీ సంఘం నాయకులు మోనంగి భాస్కరరావు, పి.అసిరి, హిమారిక విన్నారావు, చాషిములియా ఆదివాసి సంఘం నాయకులు నిమ్మక కృష్ణమ్మ, కేంద్రుక సుబ్బారావు మొదలగు నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొన్నారు

ఉచిత శిక్షణ కు 9లోగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ ట్రెనింగ్ సెంటర్ల నందు 3 నెలలు వ్యవధిలో వివిధ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.ఒక్కో నియోజకవర్గంలో 120 మంది చొప్పున మొత్తం 480 మంది నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఏం.ఆర్.నగర గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాలలో లికస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్‌లి మరియు లిడొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లి కోర్సులపై శిక్షణా ఇవ్వబడుతుందని అన్నారు. మరిన్ని వివరాల కొరకు 91772 97528 మొబైల్ నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు. కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీ పురం జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ ఐ.టి హెల్ప్ డెస్క్ అటెండెంట్ మరియు రిసెప్షనిస్ట్ కోర్సులకు సంబందించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇతర వివరాల కొరకు 63034 93720 మొబైల్ నెంబరును సంప్రదించాలని అన్నారు.పాలకొండ నియోజకవర్గంలో సీతంపేట మండలంలోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో శాంప్లింగ్ టైలర్ ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు సంబందించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మరిన్ని వివరాలు కొరకు 88976 77564 మొబైల్ నెంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.సాలూరు నియోజకవర్గంలో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ ఐ.టి హెల్ప్ డెస్క్ అటెండెంట్ మరియు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లి కోర్సులకు సంబందించి శిక్షణ ఇవ్వనున్నారని, ఇతర వివరాలు కొరకు 73825 59022 మొబైల్ నెంబరును సంప్రదించాలని అన్నారు.ఉచిత శిక్షణ పొందేందుకు కనీసం పదవ తరగతి అర్హత ఉన్న నిరుద్యోగ యువతి యువకులు ఈనెల తొమ్మిదవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని,ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజనుల హక్కులు, చట్టాలకై ఐక్య ఉద్యమం

ఆదివాసి జేఏసీ నాయకులు

విశాలాంధ్ర- గుమ్మలక్ష్మి పురం: గిరిజనుల హక్కులు, చట్టాలు పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో బుధవారం ఆదివాసీల ఆత్మగౌరవ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఎల్విన్ పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైటిసి వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ప్రభుత్వాలు ఉద్యోగాలు పేరు తో కాలయాపన చేస్తూ ఆదివాసీలను మోసగించే పనిలో ఉన్నాయి తప్ప వారి సంక్షేమం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ గిరిజనుల కోసం ఎన్నో హామీలు ఇచ్చి తీర అధికారంలోకి వచ్చిన తర్వాత మెగాడిఎస్సి పేరుతో గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ నెంబర్ 3ను రద్దు చేయడంతో డీఎస్సీలో గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కలేదన్నారు. ఏజెన్సీలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ నెంబర్ 3 కు ప్రత్యనమయంగా కొత్త జిఒ ను తీసుకువచ్చి గిరిజనులకు ప్రత్యేక డిఎస్సి తీసుకురావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 1/70 చట్టం పటిష్టంగా అమలు జరగడం లేదన్నారు. పాలక ప్రభుత్వాలు గిరిజనులకు హక్కులు ను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా పాలన సాగిస్తుంది అనడంలో సందేహం లేదన్నారు. అనంతరం రిటైర్డ్ ఎస్ డి సి కొండగొర్రి ధర్మరావు మాట్లాడుతూ ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటుచేసి గిరిజనుల చట్టాలను తీర్మానం చేసి నాడే పటిష్టంగా అమలు జరుగుతాయి అన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే గిరిజనుడు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. సీఎం చంద్రబాబు అరుకు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఎన్నికల సమయంలో వచ్చిన హామీలకు కట్టుబడి ఉండి డీఎస్సీలో గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. 1/70 పటిష్టంగా అమలు జరపాలని, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని, ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రోబ్బ లోవ రాజు, జిల్లా చైర్మన్ ఆర్.ఎస్. వరహాల దొర, జేఏసీ నాయకులు ఇంట్టికుప్పల రామకృష్ణ రావు, దుక్క సీతారాం, చంద్రశేఖర్, ఎంపిపి దినమయ్య, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ గౌరీ శంకర్రావు తదితరులు ఉన్నారు.

హాజరు ఉంటేనే... కుట్టు మిషన్

శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎంపిడిఓ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళకు స్వయం ఉపాధి కోర్సులు ఇస్తున్న సెక్షన్ లో భాగంగా కుట్టు మిషన్ సెక్షన్ లను సద్వినియోగం చేసుకోవాలని క్రమం తప్పకుండా ప్రతిరోజు శిక్షణ కేంద్రానికి రావాలని తప్పనిసరిగా 75% హాజరు ఉంటేనే ప్రభుత్వం నుంచి రాయితీపై కుట్టు యంత్రాలు మంజూరు అవుతాయని ఎంపిడిఓ జి. రమేష్ అన్నారు. మండల పరిధిలో గల మహిళలు శిక్షణ పొందుతున్న శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన బుధవారం సందర్శించారు. స్టాప్ ప్రో ఆధ్వర్యంలో మండల మహిళలకు కుట్టు మిషన్పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో శిక్షణ పొందడానికి వస్తున్న మహిళలకు మౌలిక సదుపాయాలతో పాటు త్రాగునీరు ఫ్యాన్లు వంటివి అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు ఆదేశించారు. శిక్షణ తీసుకుంటున్న వారి యొక్క హాజరును పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ హాజరు 75% దాటి ఉంటేనే యంత్రాలు మంజూరయ్యే అవకాశం ఉందని, అలాగే 45 రోజులు శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రతి స్త్రీ ఆర్థికంగా బలపడాలని సూచించారు. రెండు బృందాలు కింద సుమారు 120 మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. స్టాప్ ప్రో ప్రొప్రైటర్ రాజేష్ తో పలు సూచనలు చేయగా శిక్షకురాలు వాటితో మాట్లాడి పూర్తిస్థాయిలో ప్రతి ఒక్కరికి కుట్టు మిషన్ పై శిక్షణ ఇవ్వాలని పూర్తిస్థాయిలో ఇది ఉపయోగపడాలన్నారు.

వీఆర్ఓ కుటుంబాన్ని ఎమ్మెల్యే జగదీశ్వరి పరామర్శ

విశాలాంధ్ర -జియ్యమ్మవలస: మండలం లోని వనజ గ్రామానికి చెందిన విఆర్వో విజయానంద్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరామర్శించారు. అనంతరం విఆర్వో విజయానంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి తదనంతరం విజయానంద్ సోదరుడు మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజును ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆరిక నీలకంఠం, కొండగొర్రి ధర్మారావు, ఎంపీపీ బొంగు సురేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అక్కేన మధుసూదనరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొండి

విశాలాంధ్ర-జి.మాడుగుల: మండలంలోని సింగర్బ పంచాయతీ చేపల్లిలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు సీసీ రహదారికి బుధవారం శంకుస్థాపన చేశారు. 90మీటర్ల మేర పొడవతో చేపల్లే పనులు నాణ్యత పరిమాణాలతో నిర్మాణం చేపట్టాలని సబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పాంగి లక్ష్మి, టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, పాటి భీంబాబు, కె.లక్ష్మణ్‌రావు, నితిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
గురువారం 8, మే 2025

మలాథిన్ స్ప్రేయింగ్ పరిశీలన

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఆ శాఖ చేపట్టిన మలాథింగ్ స్ప్రేయింగ్ ను బుధవారం ఈఓపిఆర్డి రమణమూర్తి, సబ్ యూనిట్ అధికారి సిహెచ్ ధనుంజయ్ కుమార్ కలిసి పరిశీలించారు. మండలంలో గల డోకిశీల గిరిజన ఆశ్రమం పాఠశాలలో బుధవారం ఈ పిచికారి కార్యక్రమం జరిగింది. మలేరియా నిర్మూలనకు మలాథిన్ స్ప్రేయింగ్ ఎంతగానో దోహదపడుతుందని ప్రతి ఒక్కరు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. తొలి విడత కింద ప్రభుత్వం గుర్తించిన మలేరియా ప్రభావిత గ్రామాల్లో ఇప్పటికే మలాథింగ్ స్ప్రేయింగ్ ముమ్మరంగా జరుగుతుందని, అలాగే పాఠశాల తెరిచేలోపు వసతి గృహాలకు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో ఆయనతోపాటు డోకి సేల పీహెచ్సీ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

పంచాయతీరాజ అధికారి కే కొండలరావు

విశాలాంధ్ర-కొమరాడ: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచితేనే మనంఆరోగ్యంగా ఉంటామని బుధవారం జిల్లా పంచాయతీ రాజు అధికారి కే కొండలరావు కుమ్మర కుంట పంచాయతీలో ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింట చెత్త సేకరణ పరిశీలన, తడి చెత్త, పొడి చెత్త సేకరణపై మరియు ఐ వి ఆర్ ఎస్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించటం, అలాగే ఎస్ డబ్ల్యు పి సి షెడ్ పనితీరు పరిశీలించటం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి మత్రాపు రాధాకృష్ణ, సర్పంచ్ గొర్లె లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి అలమండ శ్రీను, డీ పి ఆర్ సి పడాల భీమయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ డబ్ల్యూ ఎస్ లక్ష్యం

'నీరుగారుతోంది'

అధికారుల నిర్లక్ష్యం చెరువును తలపిస్తోంది.

విశాలాంధ్ర-కూనవరం: మండు వేసవిలో కూడా చెరువును తలపిస్తున్న ఈ నీరు నిజంగా చెరువులోనిది కాదంటే ఆశ్చర్యమే. గ్రామాలకు తాగునీరు అందించాల్సిన ఆర్డబ్ల్యూఎస్ శాఖ కి సంబంధించిన పైప్ లైన్ లీకై సుమారు కొన్ని వారాలపాటు పోయిన నీరంతా ఇలా పొలాల్లో నిండుకుంది.ఇంత నీరు పోతున్న దాన్ని ఆపే ప్రయత్నం ఎవరూ చేయట్లేదంటే ఇక్కడ పని చేసే స్థానిక అధికారులకి పైఅధికారులు అంటే భయం కానీ, చేసే పనిపట్ల బాధ్యత గాని మచ్చుకైనా లేవు అనడానికి ఇంతకంటే నిదర్శనం లేదు. ఎంత అవినీతి చేసినా ఎంత నిర్లక్ష్యంగా ఉద్యోగం చేసినా ఏంకాదు మేనేజ్ చేసేయగలం అనే ధీమా ఇక్కడ ఎక్కువమంది ఉద్యోగుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.ఒకవక్క గ్రామాల్లో ఆర్డబ్ల్యూఎస్ ట్యాంకులు అలంకారప్రాయంగా ఏళ్ల తరబడి బోసిపోతున్నాయి. కానీ ఆ శాఖ అధికారులకు జీతాలు ఇవ్వక తప్పదు, గ్రామీణ తాగునీటి సరఫరా పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టక తప్పదు. అయినా లక్ష్యం నీరుగారి పోతుందని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి నీరు అందించకపోయినా కనీసం వృధా చేయకుండా కాపాడవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

టీకా వివరాల నమోదు తప్పనిసరి : డాక్టర్ జగన్మోహన్

విశాలాంధ్ర-బెలగాం : సార్వత్రిక టీకా కార్యక్రమంలో పిల్లలకు వేసిన ప్రతీ టీకా వివరాల నమోదు తప్పనిసరని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు, గర్భిణీలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేస్తున్నారా? అని రికార్డులు పరిశీలించారు. పిల్లల వయస్సు బట్టి వేయాల్సిన అన్ని టీకాలు ఖచ్చితంగా పూర్తి చేసి యువిన్, ఆర్సిహెచ్ పోర్టల్ లో ఆన్లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. తద్వారా టీకా కార్యక్రమ తీరు పర్యవేక్షణ పక్కాగా ఉండటమే గాక అవసరమైనప్పుడు వ్యాక్సిన్ సర్టిఫికెట్ కూడా జెనరేట్ చేసి అందజేయవచ్చని తెలియజేశారు. టీకా నిర్వహించేటప్పుడు ఉండాల్సిన హబ్ కట్టర్, ఎఈఎఫ్ఐ కిట్ పరిశీలించారు. వ్యాక్సిన్ వేసిన పిదప కొంత వరకు అక్కడే పర్యవేక్షణలో ఉంచాలన్నారు. టీకా అర్హుల జాబితా, గడువు తేదీల కార్డుల నిర్వహణకు సంబంధించిన టిక్లర్ బ్యాగ్ ను వినియోగిస్తున్న తీరుపై అక్కడ పరిశీలించారు. గృహ సందర్శనలు చేసి ఎప్పటికపుడు పిల్లలు, బాలింతల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, ఎఎన్ఎం డి. పోలమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో శ్రీఅభయాంజనేయ స్వామిఆలయప్రతిష్ట మహోత్సవాలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయప్రతిష్ట మహోత్సవాలు బుధవారం నాడు ప్రారంభమైనవి. ప్రత్యేకపూజలు నిర్వహించారు. పురోహితులు గన్నవరపు కామేశ్వరరావు, గన్నవరపు శ్రీనివాస్, కప్పగంతుల ప్రసాద్ శర్మల ఆద్వర్యంలో ప్రతిష్ట పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నేడు గురువారం పూర్ణ కుంభ ప్రతిష్టతోపాటు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు.

నిడగల్లు చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించిన ఇంచార్జ్ ఎంపీడీవో

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామంలో చెత్తసంపద కేంద్రాన్ని, చెత్త సేకరణను మండల పరిషత్ ఇంచార్జి ఎంపిడిఓ కుమార్ వర్మ బుదవారం సందర్శించారు. ఐవిఆర్ కాల్స్ గూర్చి, తడిచెత్త పొడిచెత్తలను వేర్వేరుగా ఇచ్చేందుకు గ్రామంలోని ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు చేయాల్సిన కార్యక్రమాలు గూర్చి వివరించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, సర్పంచ్ ఆరుద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాండి

అధికారుల తీరుపపై ఎంపీపీ మండిపాటు

విశాలాంధ్ర-జి.మాడుగుల: మండల సర్వసభ్య సమావేశంలో అధికారల తీరుపై ఎంపీపీ లొంబోరి అప్పలరాజు మండిపడ్డారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించి ముఖ్యమైన సమావేశానికి అధికారులు ఆలస్యంగా హాజరుకావడంతో పాటు పలు శాఖల అధికారులు గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ అప్పలరాజు మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేల సిబ్బంది పాలకులు కృషి చేయాలని ఎంపీపీ ఆదేశించారు. ఆర్ఎండ్బీ రహదారులో తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు కారణమవుతుందని సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. జూన్ నాటికి ఆయ పనులు పూర్తి చేస్తామని సంబంధి అధికారులు స్పష్టం చేశారు. రూ.10కోట్లతో రహదారులకు ప్రతిపాధనలు పంపించామని వాటి మంజూరు కాగానే మారుమూల గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు చేపడతామని పీఆర్ ఏఈ మాణిక్యం సమిరెడ్డి పేర్కొన్నారు. గంజాయి సాగు, రవాణాకు పాల్పడి కఠినంగా వ్యవహారించడంతో పాటు ఆస్తులు జప్తుచేస్తామని ఎస్ఐ షణ్ముఖరావు హెచ్చరించారు. జి.మాడుగుల సచివాలయ సిబ్బంది పింఛన్ దారులచేత వేలిముద్రలు వెయించుకోని పింఛన్ సొమ్ము అబ్ధిదారులకు పంపిణీ చేయాలేదని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కె.రాంబాబు డిమాండ్ చేశారు. సొలభం పంచాయతీ గొంపం నుంచి కేబీపాలెం వరకు, కె.కోడాపల్లి నుంచి గొందివీధి వరకు రహదారులు నిర్మాణాలు చేపట్టాలని సంబంధి సభ్యులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మాణిక్యం సమిరెడ్డి, విజయ్‌కుమార్ ఏవో పాత్రుడు అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నిపుణులచే

జిల్లా పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై శిక్షణ

విశాలాంధ్ర-పార్వతీపురం: నేరంచేసిన నిందితులు ఎట్టిపరిస్థితులలో తప్పించుకోకూడదని నేరంచేసిన వారికి తప్పకుండా శిక్షపడేలా చూడాలి అంటే నేరస్థుడు నేరస్థలంలో వదిలిన భౌతిక సాక్ష్యాధారాలను సేకరించు విధానంపై మరియు ధర్యాప్తు చేయువిధానంలో అధునాతన టెక్నాలజీ సహాయంతో సాక్ష్యాలను సేకరించు విధానాలపై మంచి నైపుణ్యం కలిగి ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర డి.జి.పిహరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఫోరెన్సిక్ వీక్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు.బుధవారం నాడు పోలీసు అధికారులకు, సిబ్బందికి,ప్రభుత్వాస్పత్రి వైద్యులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ,నిర్వహణ, చైన్ ఆఫ్ కస్టడీ మార్గదర్శకాలు,నేర పరిశోధనలో అనుసరించవలసిన విధి విధానాలు,ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పర్యవేక్షణలో ఫోరెన్సిక్ నిపుణులచే వన్ డే వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించి శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎస్పీమాట్లాడుతూ నేరస్థలం పరిశోధనలో దర్యాప్తు అధికారులు ఆధారాలు సేకరించవలసిన సమయంలో అందుకు అనుగుణంగా నేరం జరిగిన చోటుకు పోలీసులు ఏవిధంగా రక్షణ కల్పించాలి, నేరస్థలంలో డి.ఎన్.ఏ.,రక్త నమోనాలు, మానవ అవయవాలు, వెంట్రుకలు,నార్కోటిక్స్,మత్తు పధార్థాలు,వివిధ రకాల విషాలు,ఆడియో,వీడియో, వివిధ పత్రాలు,భౌతిక సాక్ష్యాధారాలును ఏవిధంగా సేకరించాలి,ప్యాకింగ్,నిల్వ, భద్రపరచడం,లెటర్ ప్రిపేర్, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదికను వారంలోనే పొందే విధానం,కోర్టుకు తీసుకెళ్లే సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు అనే అంశాలపై వర్క్ షాప్ లో ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు పడితేనే నేరాలు తగ్గుతాయన్నారు.ఆ దిశగా అత్యంత అధునాతన శాస్త్రీయ ప్రమాణాలు, పద్ధతులు అందిపుచ్చుకుని కేసులు దర్యాప్తు చేపట్టి కేసులు విచారణ ప్రారంభమైన సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మారుతున్న పరిస్థితులు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో కేసులు దర్యాప్తు ఉండాలన్నారు. దర్యాప్తు అధికారులకు ఫోరెన్సిక్ భౌతిక ఆధారాలు సేకరణలో పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. నేర స్థలం పరిశోధనలో ప్రతీ ఆధారం కీలకం అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు, నిపుణులు చెప్పే ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలని జిల్లా ఎస్పీసూచించారు.ఈసదస్సులో ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలంలో నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, వివిధ రకాల ప్రాణాంతకమైన విషాలు, డిఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలకు సంబంధించిన సాక్షాల సేకరణ, సైబర్ నేరాలలో పాటించవలసిన అంశాలు, ఆడియో, వీడియో, ముఖ్యమైన పత్రాల సేకరణలో పాటించవలసిన మెలకువలు గురించి క్షుణ్ణంగా తెలిపారు. సేకరించిన సాక్షాధారాలను ఏవిధంగా భద్రపరచాలి, భద్రపరిచిన వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపే సమయంలో ఎలా ప్యాకింగ్ చేయాలి. ఆ ఆధారాల ద్వారా ఎలాంటి సమాచారం కోరుకుంటున్నమో ఎలా తెలియజేయాలి వంటి అంశాలను గూర్చి విపులంగా వివరించారు. సాక్షాల సేకరణలో చేయకూడని పొరపాట్లు గురించి విపులంగా విశదీకరించారు.నిపుణులు తెలియజేసిన అంశాలకు గురించి, పోలీస్ అధికారులు వారికున్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.అనంతరం వర్క్ షాపులో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈవర్క్ షాప్ కార్యక్రమంలో జిల్లా యస్.పితో పాటు పాలకొండ డిఎస్పీ రాంబాబు, డిసిఆర్బి సిఐ ఆదాం, సీసీఎస్ సిఐ అప్పారావు, ఫోరెన్సిక్ నిపుణులు ఎం.రాంబాబు, ఎస్.నళిని, వి.ప్రశాంతి, వి.గోపాలకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మరియు జిల్లలో పనిచేస్తున్న సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ వ్యాఖ్యలపై ఆందోళనకు సిద్ధపడుతున్న పంచాయతీకార్యదర్శులు

విశాలాంధ్ర-పార్వతీపురం: ఈనెల 2న జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులపై ఆమెచేసిన వ్యాఖ్యలపై జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు బుధవారం మాస్ లీవ్ పెట్టి తమ ఆవేదనను జిల్లా గ్రామపంచాయతీ అధికారికి ,జిల్లా గ్రామ సచివాలయాల వార్డ్ ల స్పెషల్ అధికారులకి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధికారుల నుండి గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత వచ్చేవరకు గ్రామపంచాయతీ విధులు మరియు సచివాలయ పరిధిలో మాకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని పనులు మాత్రమే నిర్వహిస్తామని వారు తెలియజేశారు. గ్రామపంచాయతీలో కీలకపాత్ర పోషించి అహర్నిశలు పనిచేస్తున్న తమపై లేనిపోని వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని వారంతా ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్ విధుల్లో చేరాక తాము కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని సంఘ బాధ్యతలతో పాటు, అన్ని మండలాల సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి అర్పించిన ఎస్పీ మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సందర్భంగా బుదవారం ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, పోలీస్ అధికారులు,సిబ్బంది కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1897 లో విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారని, అల్లూరి సీతారామరాజు భారతదేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన భారతీయ విప్లవకారుడని, అతని వీరోచిత సాహసకృత్యాలకు స్థానిక ప్రజలు అతనికి మన్యం వీరుడు, అగ్గి పిడుగు అనే బిరుదులను ఇచ్చారన్నారు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసి ,బ్రిటీషు వారితో అలుపెరగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చివరకు చిన్న వయస్సులోనే బ్రిటీషువారి తూటాలకు 1924సంవత్సరం మే 7న నేల కొరిగాడన్నారు. అల్లూరి సీతారామరాజు నేడు భౌతికంగా మన మధ్య లేనప్పటికీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆ మహావీరుడిని ఒకసారి స్మరించుకోవడం ఎంతో గర్వంగా వున్నదన్నారు. గొప్ప వ్యక్తుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐ లు రాంబాబు, శ్రీనివాస రావు, ఆర్ఎస్సైలు మరియు డిపిఓ,ఎస్బీ, డిసిఆర్బి , స్పెషల్ పార్టీ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో అల్లూరి సంచరించిన ప్రాంతాల అభివృద్ధికి కృషి

బీజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ మాధవ్

విశాలాంధ్ర-కొయ్యూరు: విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. రాజేంద్రపాలెం అల్లూరి సీతారామరాజు స్మారక ఉద్యానవనంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో నిర్వహించిన మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అల్లూరి విగ్రహాలకు, అల్లూరి కాల్చి చంపబడిన చింత చెట్టు ప్రాంతంలోనూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అల్లూరి శత వర్ధంతి ముగింపు సభ లో మాధవ్ మాట్లాడుతూ 2012లో ఓ దినపత్రికలో వచ్చిన వార్త కథనానికి చలించి అల్లూరి స్మారక ప్రదేశాలను సందర్శించి అధ్వాన్నంగా నిర్లక్ష్యానికి గురై ఉన్న ప్రాంతాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు టి సుబ్బిరామిరెడ్డి, అరకు మాజీ పార్లమెంటు సభ్యురాలు కొత్తపల్లి గీత నిధులనుండి పదేసి లక్షల రూపాయలతో మంప, రాజేంద్రపాలెంలో గ్రామాల్లో గల అల్లూరి స్మారక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం ఇంకా తేడాది కేంద్ర మంత్రి సురేష్ ప్రభు నిధుల నుండి కోటి రూపాయల నిధులను మంజూరుకు కృషిచేసినట్లు తెలిపారు. రాజేంద్రపాలెంలో 50 లక్షల తోనూ, 50 లక్షల రూపాయలతోనూ పార్కు అల్లూరి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు స్థానిక గ్రామస్తులు రాజకీయాలకతీతంగా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆజాదిక అమృత్ మహోత్సవాల్లో భాగంగా గత ఏడాది కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర సమరయోధులను గుర్తించి ఆయా ప్రదేశాలు ప్రాంతాల అభివృద్ధితో పాటు విగ్రహాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. దీనిలో భాగంగానే అల్లూరి స్వగ్రామం మోగల్లులో అభివృద్ధి చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా భీమవరంలో అల్లూరి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టడం గర్వకారణం అన్నారు. మొగల్లు తోపాటు, పాండ్రంకి, రాజేంద్ర పాలెం మంప కృష్ణ దేవి పేట ఉద్యానవనాలను మరింత ఆధునీకరించి ఈ ప్రాంతాన్ని అంతటినీ పర్యాటకంగా అభివృద్ధి చేయించాలని తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. చిరుప్రా యంలోనే బ్రిటిష్ సామ్రాజ్య వాదులను గ డ గ డ లా డి ం చి న అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వంటి వీరుల త్యాగాలను నిరంతరం స్మరిస్తూ వారి ఆశయా లకు అ న ు గ ు ణ ం గా యువతరం ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. అల్లూరి స్మారక ప్రదేశాలతో పాటు లంబసింగి స్వతంత్ర సమరయోధుల గిరిజన మ్యూజియం వద్ద ప్రత్యేక అభివృద్ధి ఏర్పాట్లు నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం 9 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అల్లూరి వర్ధంతినాడే కేంద్ర ప్రభుత్వం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించి ఉగ్రవాదం సంఘ విద్రోహక శక్తులపై ఉక్కుపాదం మోపటం అభినందనీయమన్నారు. అల్లూరి రక్తం చిందించిన ఈ ప్రాంతంలో జన్మించడం సంచరించడం మనందరి అదృష్టంగా పేర్కొన్నారు. స్వాతంత్రం కోసం ప్రాణత్యాగాలు అర్పించిన స్వాతంత్ర సమరయోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి మండల అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఏపీ ట్రికర్ డైరెక్టర్, పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కూడా కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిజెపి అల్లూరి జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు ఉమామహేశ్వరరావు, అనకాపల్లి విశాఖ జిల్లాల పార్టీ అధ్యక్షులు పరమేశ్వరరావు, పరశురామరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, స్థానిక సర్పంచ్ పీతా సింహాచలం, పాడేరు మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ మంగతల్లి, రాష్ట్ర నేత గాదె శ్రీనివాస్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు అరిమెల రాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రరావు, ఓబీసీ మోర్చా సెల్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం,అనకాపల్లి జిల్లా నేత శ్రీరామ్మూర్తి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పద్మరాజు, సన్యాసిరావు, గాలి దేవుడు, మల్లేష్, రాంబాబు సత్తిబాబు, రాజు, శరభయ్య,రమేష్ త్రినాద్ తదితర పలువురు నేతలతోపాటు అధిక సంఖ్యలో మహిళలు బిజెపి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీని వీడి టిడిపిలోకి వెళ్లినా.... వైసిపి పార్టీకి నష్టమేమీ లేదు...

వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి రిమల బాలకృష్ణ

విశాలాంధ్ర-జికే వీధి: నమ్ముకున్న పార్టీ కి నమ్మక ద్రోహం చేసి ఎంత మంది పార్టీ ని వీడి వెళ్లిన వైసీపీ పార్టీ కి నష్టం లేదు, జగన్ అన్న రెక్కల కష్టం తో లక్ష మంది అభిమానులు పుట్టుకొస్తారని వైసీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి రిమల బాలకృష్ణ అన్నారు. జర్రెలు పంచాయతీ సర్పంచ్ వైసీపీ పార్టీ వీడి వెళ్లడం వలన పార్టీ కి ఎటువంటి నష్టం లేదు, పార్టీ క్యాడర్ అంత కూడా పార్టీ వెంటే వుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కోసం అధికారం పార్టీ లో వెళ్ళలేదు, కేవలం అతని మీద వచ్చిన అవినీతి నిధులు దుర్వినియోగం వంటి ఆరోపణలు బయట పడకుండ పదవి కాపాడు కోవడం కోసమే పార్టీ ని వదిలి వెళ్లారని స్థానిక ప్రజలు మాట్లాడు కుంటున్నారన్నారు. పార్టీ ని వదిలి వెళ్లేముందు వైసీపీ పార్టీ ద్వారా వచ్చిన సర్పంచ్ పార్టీ ప్రాధమిక సభ్యత్వం అంత వదిలి రాజీనామా చేసి వెళ్తే ప్రజలు హర్షిశిస్తారన్నారు. సర్పంచ్ ఒక్కరే వెళ్లి వంద కుటుంబాలు వెళ్లాయిని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ ని నమ్ముకున్న ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పార్టీ వెంటే వున్నారన్నారు. రాబోయే జరగ బోయే స్థానిక ఎన్నికల్లో గెలిచి చూపించాలిని మా వైసీపీ పార్టీ సత్తా ఏంటో చూపిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో జికె వీధి వైసీపీ పార్టీ మండల కార్యదర్శులు మువ్వల చిన్నబ్బాయి,లువ్వాబు సతీష్, మండల సీనియర్ నాయకులు జోభ స్వామి నాథం, జర్రెలు పంచాయతీ వైసీపీ పార్టీ అధ్యక్షులు సాగిన సింహ చలం, పంచాయతీ సీనియర్ నాయకులు వంతల రాజారావు, కరణం గోపాల్ కృష్ణ, ఆగురు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

జెసి వాక్యాల పై కార్యదర్శులు అభ్యంతరం



విశాలాంధ్ర-మక్కువ: జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ సోబిక నేతృత్వంలో ఈనెల 2న జరిగిన సమీక్షలో పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో, జాయింట్ కలెక్టర్ చేసిన అనుచిత వాక్యాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ద్వారా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయ పర్యవేక్షణపై ఉన్నతాధికారులను స్పష్టత కోరుతూ వినతిపత్రం ఎంపీడీవో డిడి స్వరూపా రాణికి అందజేశారు. జిల్లా అధికారుల నుండి, గ్రామ సచివాలయాలపై పర్య వేక్షణ పై ఉన్నతాధికారులు నుండి స్పష్టత వచ్చేవరకు గ్రామ పంచాయతీ విధులు మరియు సచివాలయ పరిధిలో మాకు కేటాయించిన క్లస్టర్ పరిధిలోని పనులు మాత్రమే నిర్వహిస్తామని వినతిలో తెలియపరిచారు కార్యక్రమంలో ఐ రమేష్, కే సురేష్ ఎం శంకర్ వేణుగోపాల్ సీతామాలక్ష్మి పాల్గొన్నారు

క్యాడర్లను కించపరిచే విధంగా మాట్లాడడం తగదు



విశాలాంధ్ర - బెలగాం/ గరుగుబిల్లి: ఎంఎల్ హెచ్పిల ధర్నాలో ఏఎన్ఎంలపై, సూపర్ వైజర్లపై వయా సోషల్ మీడియా వేదికగా చేసిన అనుచిత వాక్యాలను ఖండిస్తూ నిరసనగా గరుగుబిల్లి పిహెచ్సిలో సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్ హెచ్పిలు తమ హక్కుల కోసం ధర్నా చేయడం తప్పు కాదని కానీ మిగతా క్యాడర్లను కించపరిచే విధంగా మాట్లాడడం ఏఎన్ఎంలకు రూ.50000 ఇస్తున్నారని, ఎబిసిడిలు రాని సూపర్ వైజర్లకు రూ.70000 ఇస్తున్నారని, ఏఎన్ఎం అర్హత వున్న సూపర్ వైజర్లు లక్షలు తీసుకుంటున్నారని, ఇక్కడి గవర్నమెంట్ చదువుకున్న వాళ్లకి విలువ ఇవ్వడం లేదని, భవిష్యత్తులో ఎక్కువ చదవ కూడదని, ఏఎన్ఎం చేస్తే శాలరీ వస్తుంది, ఈజీగా జాబ్ కూడా వస్తుందని ఇది ఎక్కడి న్యాయం అని, మెడికల్ ఆఫీసర్ల యొక్క యాప్ లు, ఏఎన్ఎంల యొక్క యాప్ లు అన్నీ కూడా మాతో చేపిస్తున్నారని అనడం చాలా తప్పని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన యెడల ఉన్నాతాదికార్లకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఎస్. దుర్గాప్రసాద్, బి. చిన్నమ్మి, సి.హెచ్ ఉదయకుమారి, ఎ.వి రవణమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జర్రిల పంచాయితీ టిడిపిగ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం జర్రిల పంచాయితీ టిడిపి గ్రామ కమిటీని మండల అధ్యక్షులు ముక్కలి రమేష్,జి.కె.వీధి మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బుధవారం జరిగిన జర్రిల గ్రామం లో రచ్చబండ వద్ద సమావేశం నిర్వహించి గ్రామ కమిటీ అధ్యక్షులు గా మణుగూరు రంగారావు ను, ఉపాధ్యక్షులుగా సాగిన కొండబాబు ను, ప్రధాన కార్యదర్శులుగా సాగిన మురళి, కించె లక్ష్మి పడాల్ ను, కోశాధికారి గా పాసేల బాబురావు ను మిగతా కార్యదర్శులు, సహాయ కార్యదర్శులుగా రీమల బుజ్జిబాబు, అంపురంగి కొండబాబు, డొంకడ అప్పారావు, బీరంగి రాజు, లువ్వాబు మత్స్యారాజు, కిముడు ఈశ్వరరావు లను ఎన్నుకోవడం జరిగింది. పంచాయితీ లో ఎటువంటి సమస్యలు ఉన్న ఆ సమస్యల పరిష్కారం కోసం అందరం కలసి కట్టుగా నిర్ణయం తీసుకుంటామని ఎన్నికైన సభ్యులందరూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ టిడిపి నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

మక్కువలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

విశాలాంధ్ర-మక్కువ: మక్కువలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ యాళ్ల వివేక్, డాక్టర్ వైవి పద్మజ తెలిపారు. పార్వతీ పురంలో గల కుటుంబ ఐవిఎఫ్ ఫెర్టిలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత సంతాన సాఫల్య శిబిరంలో డాక్టర్ రాళ్ల ధీరజ్ , డాక్టర్ పైలా రాణి రోజ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్టు వారు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతమైన మక్కువలో ఈనెల 9వ తేదీ శుక్రవారం నాడు డాక్టర్ , బి త్రినాధరావు క్లినిక్ నందు ఉచిత సంతాన సాఫల్ శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. సంతానం లేమితో బాధపడుతున్న దంపతులు మక్కువలో ఏర్పాటు చేస్తున్న ఈ ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు. శుక్రవారం నాడు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ శిబిరం ద్వారా ఉచితం కన్సల్టేషన్, స్కానింగ్, కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ఐ యు ఐ చికిత్స ఉచితంగా చెయ్యబడునన్నారు. అలాగే ఐవిఎఫ్ చికిత్స పై 50 శాతం డిస్కౌంట్ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని మక్కువ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పి ఆర్ ఓ , డి హరీష్ ఈ సందర్భంగా కోరుతున్నారు. అవసరమైన వారు ఫోన్ నంబరును 6302024950 సంప్రదించాలని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి 40 వేలు జరిమానా

విశాలాంధ్ర-పాచిపెంట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురి వ్యక్తులకు పదివేల రూపాయలు చొప్పున 40'000 సాలూరు జే ఎఫ్ సి ఎం మెజిస్ట్రేట్ జి హర్షవర్దన్ జరీ మాన విధించినట్లు పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన నలుగురికి జరీమేనా మెజిస్ట్రేట్ విధించారని రెండవసారి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే జరిమానా తో పాటు ఆరు నెలలు జైలు శిక్ష ఉంటుందని మెజిస్ట్రేట్ తెలిపినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.